క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): ఈనెల 12వ తేదీన నంద్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేవలం తాగునీటి సమస్యపై మాత్రమే చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

కందిపప్పుపై రంజాన్ శోభ



కందిపప్పుపై ప్రార్థనలు చేస్తున్న చిత్రం

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ కందిపప్పు గింజపై రంజాన్ శోభను చిత్రించారు. ఒక ముస్లిం అల్లాను ప్రార్థిస్తుండగా నెలవంక, మసీదును చిత్రించారు.

ఓటు హక్కు వినియోగంపై రేపు ర్యాలీ

నంద్యాల(సిటీ): ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో తమ విలువైన ఓటును వినియోగించుకోవాలని శుక్రవారం పట్టణంలో చేపట్టే అవగాహన ర్యాలీని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ మున్సిపల్ కార్యాలయం నుంచి సంజీవనగర్ వరకు నిర్వహించే ర్యాలీలో మున్సిపల్ కార్యాలయ, ఇండోర్, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

పాణ్యం: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని కొత్తూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో బుధవారం రాతిదూలం పోటీలను పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్య నారాయణరెడ్డి ప్రారంభించారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో 24 వృషభరాజములు పాల్గొననున్నాయి. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ. 15వేలు, రూ.12 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున అందజేయనున్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సుధాకర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

మహానంది: అల్లినగరం గ్రామానికి చెందిన కాశయ్య విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురవ్వడంతో తీవ్ర గాయాలైన ఘటన బుధవారం బుక్కాపురం, తమ్మడపల్లె శివారులో చోటు చేసుకుంది. కాశయ్య ఎర్త్ ఫీజు వేయడానికి వెళ్లగా.. బుక్కాపురం సమీపంలోని ఓ రైస్‌మిల్ వద్ద పిన్ బైండింగ్ వైరు గాలికి ఊడి లైన్లకు తగిలి షాక్‌కు గురయ్యాడు. గాయపడిన కాశయ్యను వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండల అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు.

కొనసాగుతున్న చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు బుధవారం కొనసాగాయి. ఆలయ అసిస్టెంటెట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం గ్రామానికి చెందిన సూర్యనారాయ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామి వారికి గ్రామోత్సవం జరిగింది.

13న సీతారాముల కల్యాణం



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: ఈనెల 13న మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సీతారాముల కల్యాణం ఉంటుందని ఉత్సవ సమితి అధ్యక్షులు కె.క్రిష్టన్న తెలిపారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు గోశాలలో తలంబ్రాల సేవ, శుక్రవారం స్వామి వార్లకు తిరుమంజన సేవ ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, కార్యదర్శి ఎమ్.నాగోజీరావు, కోశాధికారి కల్కిమురళి, సంయుక్త కార్యదర్శులు ఎస్.నటేష్‌కుమార్, గోపీనాథరావు, మల్లికార్జున, నరసింహారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సకల వసతులు

- కేంద్రాలుగా పాఠశాలలు
- నాడు–నేడుతో బడుల రూపురేఖలు మార్చిన ప్రభుత్వం
- అందుబాటులో అన్ని సౌకర్యాలు
- ఓటర్లు, సిబ్బందికి తప్పిన అవస్థలు



డబ్ల్యూ గోవిందిన్నెలోని 19, 20 పోలింగ్ కేంద్రాలు



క్రిష్టిపాడులోని 4, 5 పోలింగ్ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు

దొర్నిపాడు: ఎన్నికల వేళల్లో పోలింగ్ కేంద్రాల్లో అరకొర వసతులతో గతంలో ఎన్నికల సిబ్బంది, ఓటర్లు ఇబ్బందులు పడేవారు. విద్యుత్, వెంటిలేషన్, ఫ్యాన్లు లేక పోవడంతో అవస్థలు తప్పేవి కాదు. దాదాపు పోలింగ్ కేంద్రాలన్నీ పాఠశాలల్లోనే ఏర్పాటయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద నిధులు కేటాయించి బడుల్లో సకల సౌకర్యాలు కల్పించింది. దీంతో ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు తప్పనున్నాయి.

సకల సౌకర్యాలు..

ఎన్నికల తేదీ నాటికి ఒక్క రోజు ముందే అధికారులు ఆయా గ్రామాలకు చేరుకొని ఓటింగ్ సంబంధించి ఏర్పాట్లు చేసుకొని అక్కడే బస చేసి ఉదయం పోలింగ్‌కు సిద్ధం అవుతారు. దీంతో విద్యుత్, వెంటిలేషన్, ఫ్యాన్లు, దివ్యాంగుల కోసం ర్యాంప్, బాత్ రూంలు తదితర వాటిని ఇప్పటికే ప్రభుత్వం నాడు–నేడు కింద ఏర్పాటు చేసింది. అలాగే భవనాలు నూతనంగా, రంగులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కూడా ఉండటంతో ఎన్నికల సిబ్బందికి సౌకర్యవంతంగా ఉండనున్నాయి.

మండల ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

గ్రామం	పీఎస్ నంబర్లు	పురుషులు	మహిళలు	మొత్తం
గుండుపాపల	1,2	657	667	1,324
ఉమాపతినగరం	3	183	210	393
క్రిష్టిపాడు	4,5	789	823	1,612
అమ్మిరెడ్డి నగరం	16	309	311	620
బుర్రారెడ్డిపల్లె	17, 18	669	717	1,386
డబ్ల్యూ గోవిందిన్నె	19, 20	1,007	946	1,953
డబ్ల్యూ కొత్తపల్లె	21,22	883	824	1,707
చాకరాజువేముల	27,28,30,31	1,657	1,654	3311
వెంకటేశ్వనగరం	29	126	128	254
అర్జునాపురం	32	376	371	747
దొర్నిపాడు	33,34,35,36	2,192	2,202	4,394
కొండాపురం	37	302	319	621
భాగ్యనగరం	38	248	273	521
రామచంద్రాపురం	39, 40	607	656	1,257
మొత్తం	పోలింగ్ స్టేషన్లు : 26	10,005	10,095	20,100



దొర్నిపాడులోని పోలింగ్ కేంద్రంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల సౌకర్యం

గతంలో ర్యాంప్ లేక ఇబ్బందులు పడ్డాం



పోలింగ్ కేంద్రాల వద్ద గతంలో ర్యాంప్ సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంప్ ఉండటంతో దివ్యాంగులకు అవస్థలు తప్పుతాయి. ప్రస్తుతం అన్ని కేంద్రాల్లో వసతులను ప్రభుత్వం సమకూర్చింది. ఎన్నికల సారోళ్లకు కూడా సమస్యలు ఉండవు.

– చెన్నయ్య, దివ్యాంగుడు, క్రిష్టిపాడు

ఇబ్బందులు తప్పినట్లే..



నాడు–నేడు పనులు పుణ్యమా అని పోలింగ్ కేంద్రాలకు మంచి రూపురేఖలు వచ్చాయి. ఓటర్లు క్యూలో నిలుచున్నా ఎలాంటి అవస్థలు పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మరుగుదొడ్లు, లోపల ఫ్యాన్లు, విద్యుత్, తాగునీటి వసతులు ఉన్నాయి. గతంలో సరైన మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడేవారు. – శాంతయ్య, డబ్ల్యూ గోవిందిన్నె

మద్యం బాటిళ్లు స్వాధీనం

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె మెట్ట వద్ద 102 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. ఆళ్లగడ్డ మండలం బత్తులూరుకు చెందిన ఓబులరెడ్డి, కరుణ ఈ నెల 9వ తేదీ రాత్రి మద్యం బాటిళ్లతో నిలబడి ఉండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్ విరాళం



వెంటిలేటర్‌ను దేవస్థాన వైద్యులకు అందజేస్తున్న వసతి విభాగ ఏఈఓ మోహన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన వైద్యశాలకు మధ్యప్రదేశ్‌కు చెందిన సునీల్‌కుమార్ భరద్వాజ్ అనే భక్తుడు ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్ విరాళంగా ఇచ్చారు. బుధవారం వెంటిలేటర్ శ్రీశైల దేవస్థానానికి చేరింది. మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తుల ఆరోగ్య అవసరాల కోసం శ్రీశైల దేవస్థానం వైద్యశాలను నిర్వహిస్తుంది. ఇటీవల మల్లన్న దర్శనానికి వచ్చిన సునీల్‌కుమార్ భరద్వాజ్ దేవస్థాన వసతి విభాగ సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎస్.వి.మోహన్‌ను కలిశారు. ఆయన దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్ విరాళంగా అందిచాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించిన సునీల్‌కుమార్ శ్రీశైల దేవస్థానం పేరుతో సుమారు రూ.5లక్షల విలువ చేసే వెంటిలేటర్‌ను బుక్ చేశారు. ఈ వెంటిలేటర్ హాస్పిటల్‌లో, అంబులెన్స్‌లో కూడా వినియోగించవచ్చు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



సుద్దమల్లలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు



చాగలమర్రిలో పెద్దమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగ మరుసటి రోజు గ్రామ దేవతలైన పెద్దమ్మ, గంగమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, చౌడేశ్వరి దేవికి పూజలు చేయడం ఆనవాయితీ ఇందులో భాగంగా బుధవారం ఆయా గ్రామాల్లో ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు బోనాలు నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పెద్దమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో కొలువైన మూలపెద్దమ్మ దర్శనానికి భక్తులు బుధవారం పోటెత్తారు. ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానికులు మొక్కులు చెల్లించేందుకు ఏటా భారీ సంఖ్యలో రావడం వస్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నూతన చీర, పండ్లు, పూలు, పిండివటలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు వసతులు కల్పించారు.

భక్తి శ్రద్ధలతో బోనాలు

చాగలమర్రి: ఉగాది పండుగ సందర్భంగా స్థానిక నారాయణపల్లె గ్రామ రస్తాలో వెలసిన గ్రామ దేవత పెద్దమ్మ అమ్మవారికి భక్తులు బుధవారం చీర, సారెతో పాటు బోనాలు సమర్పించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ దేవతలకు గ్రామస్తులు భక్తి, శ్రద్ధలతో బోనాలు సమర్పించి వచ్చే సంవత్సరంలో పంటలు బాగా పండాలని వేడుకున్నారు.



మహానంది ఆలయం ముందు భక్తజనం



కోనేరులో కన్నడ భక్తుల పుణ్యస్నానాలు

మహానంది భక్తజనసంద్రం

- క్షేత్రానికి పోటెత్తిన కన్నడిగులు
- రెండ్రోజుల పాటు నిరంతర దర్శనం
- కిక్కిరిసిన రెండు వైపులా పార్కింగ్ స్థలాలు

మహానంది: మహానంది ఆలయానికి బుధవారం కన్నడ భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకు రెండ్రోజుల పాటు మహానందీశ్వరుడి దర్శనం నిర్విరామంగా సాగింది. లక్షలాది సంఖ్యలో కన్నడిగులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తజనసంద్రంగా మారాయి. భక్తులరద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులరద్దీ అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అంత మందిలో వెళ్లలేని పలువురు భక్తులు ఆలయం రాజగోపురం, ముఖ ద్వారం నుంచే మహానందీశ్వరుడిని నమస్కరిస్తూ వెనుదిరిగి వెళ్లారు. నంద్యాల, గాజులపల్లె వైపు ఏర్పాటు చేసిన రెండు టోల్‌గేట్లు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఆలయానికి దగ్గర్లోనే పార్కింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా ఆలయానికి వచ్చారు. డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



మహానంది క్షేత్రంలో కన్నడ భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

అప్రమత్తతతో తప్పిన ట్రాఫిక్ గండం



డ్రోన్ కెమెరా ద్వారా ట్రాఫిక్ జామ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

శ్రీశైలం: శ్రీశైలంలో ఉగాది బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. పండుగ రోజున దాదాపు 8,200 వాహనాలు శ్రీశైలానికి చేరుకున్నాయి. రద్దీకి అనుగుణంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఎప్పటి కప్పుడు పోలీసు శాఖను అప్రమత్తం చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా భక్తులకు తిరుగు ప్రయాణం సాఫీగా సాగింది. ఉగాది రోజున సాయంత్రం శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి రథోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం ఒక్కసారిగా పెద్ద మొత్తంలో భక్తులు తిరుగుప్రయాణం చేస్తారనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల వైపు ఉన్న అన్ని ట్రాఫిక్ పాయింట్లను అప్రమత్తం చేశారు. స్వయంగా డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తూ.. పోలీసు అధికారులకు అప్పటి కప్పుడూ ఆదేశాలిస్తూ ట్రాఫిక్ జాం జరగకుండా నియంత్రించారు.



ఉయ్యాలవాడలో ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా



చాగలమర్రిలో ప్రత్యేక నమాజు చేసుకోవడానికి ఏర్పాటు చేసిన షామియానాలు

నేడు రంజాన్

ఉయ్యాలవాడ : నెలవంక కనిపించింది. రంజాన్ పండుగను గురువారం జరుపుకునేందుకు ముస్లింలు చాంద్ దిఖాయా అంటూ బుధవారం సాయంత్రం ముబారక్ చెప్పుకున్నారు. గత నెల 12 నుంచి రంజాన్ మాసం ప్రారంభమైంది. నాటి నుంచి ముస్లింలు ఉపవాస దీక్షతో పాటు నమాజ్‌లో పాల్గొన్నారు. నేడు నిర్వహించనున్న పండుగకు ఈద్గాల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చాగలమర్రి: నెల రోజులుగా ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లింలకు బుధవారం నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ పండుగ నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ఈద్గా వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనలకు పందిర్లు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనుస్ తెలిపారు.

తిరునాలకు ఆలయాలు ముస్తాబు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామివార్ల తిరునాలకు ఆలయాలు బుధవారం ముస్తాబయ్యాయి. ఆలయాలను దేవదాయ శాఖ వారు విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సర చైత్ర శుద్ధ విదియలు బుధవారం మొదలై చైత్ర శుద్ధషష్టి ఆదివారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈఓ కార్తీక్, ధర్మకర్తల మండలి చైర్మన్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 10 వతేదీ రాత్రి 12 గంటలకు శ్రీ వారి కల్యాణోత్సవం, 11న రాత్రి 10 గంటలకు స్వామివారి ప్రభోత్సవం, 10.30 గంటలకు కాడి, గిరక, బండి లాగుట, బండి చక్రములు విడదీసి తగిలించుట పందెములు జరుగునని తెలిపారు. 12న సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవం, 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 13న పారువేట ఉత్సవం, 14న తీర్థావళి, వసంతోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమాలు అన్ని దుద్యాల గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



తిరునాలకు ముస్తాబైన ఆలయం

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రాలను అందజేయడానికి వచ్చిన 38వ వార్డు వలంటీర్లు

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణంలోని 2, 7, 30, 33, 38 వార్డులకు చెందిన 92 మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి అందజేశారు. 2వ వార్డులోని 20మందికి గాను 18మంది రాజీనామా చేశారు. 30వ వార్డులోని 26మందికి గాను 23మంది, 33వ వార్డులో 18మందికి 14 మంది, 38వ వార్డులో 38మందిలో 22మంది,7వ వార్డులో 29మందిలో 15 మంది తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా రాజీనామా చేశామని ప్రతిపక్షాలు తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని కోరారు. గతంలో తమను అవమానకరంగా మాట్లాడిన వారే నేడు జీతాలు పెంచి ఇస్తామనడం నమ్మశక్యంగా లేదన్నారు.

బిల్లలాపురంలో..

నంద్యాల(అర్బన్): మండలంలోని బిల్లలాపురం గ్రామ వలంటీర్లు బుధవారం 8 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. వలంటీర్లు జ్యోతి, వెంకటేష్ మాట్లాడుతూ తాము స్వచ్ఛందంగా రాజీనామా చేశామని తెలిపారు.

ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రమూర్తి



రామాయణ విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): మనిషిగా పుట్టి సమాజంలో ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపి శ్రీరామచంద్రుడు ఆరాధ్య దైవమయ్యారని సంస్కృత పండితుడు డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమం మొదటి రోజు శ్రీరామనవమి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. టీటీడీ జిల్లా శాఖ అధికారి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మానవీయ విలువలను కాపాడుకోవాలంటే శ్రీమద్రామాయణం చదవాలని సూచించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, వెంకట శేషయ్య, గంగాధర చౌదరి, భార్గవ రామశర్మ, శివదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.